క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



బాధితునికి ఆర్థికసాయం అందిస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని 37వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉప్పర గోపాల్ సెల్యులైటిస్ వ్యాధితో కొన్ని రోజులుగా సతమతమవుతున్నాడు. ఈ నెల 6న ఆ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఈ విషయం తెలిసింది. బాధితుడితో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన సతీమణి కేతిరెడ్డి సుప్రియ రూ.50 వేలను బాధితునికి అందించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, చింతా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎలవగంప ఉరుసు



ఎలవగంపను ఊరేగిస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: మండల పరిధిలోని కొక్కంటివారిపల్లిలో శనివారం చెన్నకేశవస్వామి ఎలవగంప ఉరుసు ఉత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వెదురు గంపలో చెన్నకేశవ స్వామిని కొలువు దీర్చి ఊరి వెలుపల వెలసిన బావిలో ప్రత్యేక పూజలు చేశారు. కొమ్ము, ఉరుములు, మంగళ వాయిద్యాలతో ఎలువ గంపను ఎత్తుకెళ్లి గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటా పూజలు చేసి ఆలయం వరకు కోలాహలం నడుమ తీసుకెళ్లారు. పూజలు చేసి విచ్చేసిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్ మాట్లాడుతు విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వచ్చేలా అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి అభినందనలు



ఎంపీపీ త్రివేణికి అభినందనలు తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిలను శనివారం ధర్మవరానికి చెందిన బంజారా గిరిజన సంఘం నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీచర్ రాము నాయక్, శ్రీనా నాయక్, గోపాల్‌నాయక్, పోమ్లానాయక్, ఎన్‌సీ నాయక్ తదితరులు ఉన్నారు.

ఖాద్రీశా.. ఘోష తీర్చవా?

- స్వామివారి గోవులకు రక్షణ కరువు
- అపహరించుకెళ్తున్న దుండగులు
- గోశాల ఉన్నా నిరుపయోగం
- రోగాలు వస్తున్నా పట్టని అధికారగణం

కదిరి టౌన్: కదిరిలో శ్రీవారి ఆలయానికి చెందిన గోవులకు రక్షణ కరువైంది. వాటి గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పట్టణంలోని జాతీయ రహదారిలో గోవులు ఉండిపోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఈ క్రమంలోనే దుండగులు గోవులను కబేళాలకు రాత్రి వేళల్లో అపహరించుకుపోతున్నారు. ఆలయం తరఫున గోవుల రక్షణ కోసం గాండ్లపెంట మండలంలోని కఠారుపల్లి వద్ద రూ. 5 లక్షలతో గోశాలను ఏర్పాటు చేశారు. భవనం నిరుపయోగంగా మారడంతో గోవులు పట్టణంలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం పశువులకు లంపీ స్కిన్ (బొబ్బలరోగం) వ్యాధి వంటి రోగాలు సోకుతుండడంతో సంబంధిత వైద్యాధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆలయ అధికారులు స్పందించి మూగజీవాలను సంరక్షించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన గోశాల



రోడ్లపై తిరుగుతున్న ఆలయ పశువులు

గోశాలకు తరలించాలి



ఆలయానికి చెందిన పశువులు జాతీయ రహదారిపై తిరుగుతున్నాయి. ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నా ఎవరూ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మేత లేక చిత్తుకాగితాలు తింటున్నాయి. గోశాలకు తరలించి సంరక్షించాలి. ఆలయ అధికారులు చర్యలు చేపట్టాలి,

– శ్రీనివాసులు, కదిరివాసి

దాతలకు అప్పగిస్తాం



పశువులను గోశాలకు తరలించాక ఏమైనా జరిగితే ఇబ్బందులు తలెత్తుతాయి. దాతలను సమావేశపరిచి గోవుల సంరక్షణను అప్పగిస్తాం. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం. పశువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– వి.శ్రీనివాసరెడ్డి, ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓ

వ్యక్తిపై అట్రాసిటీ కేసు

బత్తలపల్లి: ఛాయ్ క్లబ్ నిర్వాహకులపై దాడి చేసిన కేసులో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రి ఎదురుగా ఛాయ్ క్లబ్‌ను సోమశేఖర్, సౌభాగ్య దంపతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం క్రితం బత్తలపల్లికి చెందిన మల్లిఖార్జున కుమార్తె అక్కడ ఐస్‌క్రీం కొనుగోలు చేసిందని, తరువాత శుక్రవారం ఉదయం తిరిగి ఐస్‌క్రీంకు వెళ్లగా ధరలు తేడాలు రావడంతో ఘర్షణ పడినట్లు తెలిపారు. సాయంత్రం మల్లిఖార్జున వచ్చి గొడవకు దిగి, భార్యభర్తలపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కనగానపల్లి: మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష ప్రవేశ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు.

డ్యాం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: అప్పరాచెరువు గ్రామ సమీపంలో చిత్రావతి నదిపై రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు కమ్ చెక్‌డ్యాం నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరిశీలించారు. గత ఏడాది వర్షాలు కురవడం వల్ల పనులు ఆలస్యంగా మొదలైనా శరవేగంగా పూర్తి చేయడం పట్ల ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయితే చిత్రావతి నది పరివాహక ప్రాంతాలలోని 8 గ్రామాల ప్రజల రాకపోకలకు, రైతులకు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. నది అటువైపు ఉండడం వల్ల దారి లేక 200 ఎకరాలను చెన్నరాయపట్నం గ్రామానికి చెందిన రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారు. చెక్‌డ్యాం వద్ద నుంచి ఉప్పర్లపల్లి చెరువుకు ఫీడర్ ఛానల్‌ను పూర్తి చేయించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి సూచించారు. ఫీడర్ ఛానల్ కింద చెన్నరాయపట్నం, జ్వాలాపురం, కోడేకండ్ల, రామాపురం మీదుగా చిత్రావతి నది నీటితో ఉప్పర్లపల్లి చెరువు నింపుకోవచ్చు. చెరువు కింద సుమారు 400 నుంచి 500 ఎకరాలు పంటలు సాగు చేసుకోవచ్చునని మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంట ఈశ్వర్‌రెడ్డి, నాయకులు సంద్ర రామకృష్ణ, లింగమయ్య, పెద్దన్న, ముసలప్ప, నారాయణస్వామి, హరి తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



ప్రసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని టీ. వంకపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. నేత్రపర్వంగా జరిగిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయాభివృద్ధికి రూ. 50 వేలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డికి కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అత్యం విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నల్లచెరువు ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు రామాంజులురెడ్డి, తిమ్మారెడ్డి, మోహన్, ప్రకాష్, గౌడచెరువు రాజశేఖర్‌రెడ్డి, సాంబశివ, శ్రీకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భగుడి ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని యాదవవీధిలో శ్రీ స్వయంభూ వినాయక దేవాలయం నిర్మాణంలో భాగంగా శనివారం గర్భగుడి ముఖ ద్వారం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వయంభూ వినాయక దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున, గౌరవాధ్యక్షులు మూగి రాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో ఆలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు అరిగెల రమేష్‌బాబు, దేవరపల్లి చెన్నారెడ్డి, కార్యదర్శి రమణారెడ్డి, సంయుక్త కార్యదర్శి కోటి వెంకటేష్, బెస్త భాస్కర్, ట్రెజరర్ సురేష్‌బాబు, కమిటీ సభ్యులు రామారావు, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులున్నారు.

ఆలయ గోపుర నిర్మాణానికి భారీ విరాళం



ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం అందిస్తున్న గంగుల భానుమతి

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువులో వెలసిన తిమ్మప్పస్వామి ఆలయ గోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి రూ.6 లక్షల విరాళం ప్రకటించారు. గ్రామంలో రెండు రోజుల నుంచి తిమ్మప్ప స్వామి పరుష జరుగుతోంది. శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గంగుల భానుమతి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ఆలయ గోపురానికి తనవంతు విరాళాన్ని అందించారు. గ్రామంలో నిర్వహించిన రాతిదూలం పోటీల్లో గెలుపొందిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఖాద్రీ ఆలయం



స్వామి దర్శనం కోసం వెళ్తున్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



ఓరువాయిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్ రెడ్డి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఓరువాయి గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా 500 సేవలు అందుతాయని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కారమవుతాయన్నారు. చంద్రబాబు పాలనలో లంచం ఇవ్వనిదే ఏ పని జరిగేది కాదని గుర్తుచేశారు. జగనన్న వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. రాబోవు రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండాలన్నారు. అన్ని వసతులతో కూడిన సచివాలయ భవనం నిర్మించి ఇచ్చిన కాంట్రాక్టర్ పల్లె వెంకటరెడ్డి, నరసింహారెడ్డిని, స్థల దాతలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అదనపు గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రామలక్ష్మమ్మ, సర్పంచ్ గంగాదేవి, శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, డైరెక్టర్ ఆదిమూర్తి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు రమణారెడ్డి, బత్ర శివారెడ్డి, ఆనంద్‌రెడ్డి, పీఆర్ శంకర్, నాగూరి బయ్యారెడ్డి, సుబ్బిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఆదినారాయణ, రవికుమార్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో అవగాహన పెంచండి

కదిరి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలుగుతున్న ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్ నగర్‌లోని బైరెడ్డి మాన్షన్‌లో 'ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ' అనే అంశంపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఏ విధంగా పరుగులు పెడుతోందో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ జీడీపీ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఏడో స్థానంలో ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి డబ్బు అకౌంట్‌లో వేస్తుండడం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగడం లేదన్నది కేవలం అపోహేనన్నారు. కదిరిలో రూ. 220 కోట్లతో బైపాస్‌రోడ్డు నిర్మాణం, 150 గ్రామాలకు పైగా అప్రోచ్‌రోడ్లు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హంద్రీనీవా ద్వారా చెరువులు నింపడం, ఏరియా ఆసుపత్రిని ఆధునీకరించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్‌కు గాయాలు

ఓడీ చెరువు: ఆటోను కారు ఢీ కొనడంతో డ్రైవర్ సుధాకర్ గాయపడ్డాడు. మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో కదిరి– హిందూపురం రహదారిపై శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అమడగూరు మండలం తనకంటివారిపల్లికి చెందిన సుధాకర్ ఆటోలో గోరంట్ల నుంచి మహమ్మదాబాద్‌కు వెళ్తున్నాడు. మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో కదిరి నుంచి హిందూపురం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సుధాకర్ కాలు విరిగింది. ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఈఎంటీ హరి, పైలట్ సనావుల్లా ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమచికిత్స చేసి కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గడ్డివాము దగ్ధం

ఓడీ చెరువు: మండలపరిధిలోని ఉగ్గిరెడ్డిపల్లిలో పాడిరైతు పూజారి చౌడప్పకు చెందిన గడ్డివాముకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఇంటి ముందు వేసుకున్న గడ్డివాముకు అర్ధరాత్రి నిప్పు పెట్టారని, ఒక్కసారిగా మంటలు అంటుకుని కాలి వాము బూడిదైందన్నారు. దీంతో పశువులకు మేతలేకుండా పోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేరాలు నియంత్రించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి: ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో నేరాలు, రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని డీఎస్పీ టి.శ్రీనివాసులు సూచించారు. శనివారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో కేసులు వివరాలు, సీడీ ఫైల్, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డివిజన్ పరిధిలోని సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఫ్యాక్షన్, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించామన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వాటిపై దృష్టి సారించి అవసరమైన చోట వేగనిరోధకాలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయించి రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష ఉన్నారు.

'టీడీపీలో వడ్డెర్లకిచ్చిన ప్రాధాన్యతేంటి?'



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

కొత్తచెరువు: టీడీపీలో రాజకీయంగా వడ్డెర్లకిచ్చిన ప్రాధాన్యత ఏముందని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ వడ్డె వెంకటరాముడు విమర్శించారు. శనివారం కొత్తచెరువులో వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వడ్డెర్లకు రెండు ఎమ్మెల్సీ పదవులు, మరెన్నో నామినేటెడ్ పోస్టులు కల్పించారన్నారు. అవన్నీ పట్టించుకోకుండా వడ్డెర సాధికారత కమిటీ కన్వీనర్ ఎమ్మెల్సీపైనా, వైఎస్సార్ సీపీపైనా విమర్శలు చేయడం తగదన్నారు. టీడీపీ చరిత్రలో ఇప్పటి వరకూ వడ్డెర్లకు రాజకీయంగా ఎక్కడైనా అవకాశం కల్పించిన దాఖలాలు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వడ్డి మారెప్ప మాట్లాడుతూ వడ్డెర్ల ముద్దుబిడ్డలైన ఎమ్మెల్సీ ఏసురత్నం, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను విమర్శించే స్థాయి వడ్డె వెంకట్‌కు లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు వడ్డెర్లను గుర్తించి గోరంట్ల శాసనసభ స్థానం లాయర్ సిద్దయ్యకు, కదిరిని బత్తల వెంకటరమణకు కేటాయించారని, అదే బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వడ్డెర్లపై ఉన్న మమకారాన్ని నిరూపించుకున్నారన్నారు. టీడీపీ కార్యాలయంలో రూ. 4 వేలకు పనిచేస్తూ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కోవర్టుగా ఉన్న వెంకట్‌కు వడ్డెర నాయకుడినని చెప్పుకునే అర్హత లేదని స్పష్టం చేశారు.

వలంటీర్ సేవాభావం

ఓడీ చెరువు: అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకే వెళ్లి ఈ కేవైసీ చేయించి వలంటీర్ సేవాభావం చాటుకున్నాడు. ఓడీ చెరువుకు చెందిన వినోద్ కొన్ని నెలల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే, వైఎస్సార్ బీమా గడువు ముగుస్తున్న నేపథ్యంలో గ్రామానికి చెందిన వలంటీర్ సురేష్‌కుమార్ బెంగళూరు నగరానికి వెళ్లి వినోద్‌తో ఈకేవైసీ చేయించాడు. వలంటీర్‌ను అధికారులు, స్థానికులు అభినందించారు.

మహిళపై కత్తితో దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక పాతూరు కాయగూరల మార్కెట్‌లో గంగమ్మ అనే మహిళపై బోయ హరి అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన మేరకు.. గంగమ్మ కుమార్తె తల్లివద్దనే ఉంటోంది. ఈ క్రమంలో బోయహరి ఆమెకు దగ్గర కావాలనుకున్నాడు. విషయం తెలుసుకున్న గంగమ్మ తన కుమార్తెను హరి నుంచి దూరంగా ఉంచింది. దీన్ని జీర్ణించుకోలేని హరి తమ మధ్య గంగమ్మ అడ్డుగా ఉందని ఆమెపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు స్పందించి అతన్ని అడ్డుకున్నారు. దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. శనివారం పోలీసులు బోయ హరిని అరెస్ట్ చేశారు.